వేదాంతభేరి

జూలై 2017

రూ. 10/-

వేదాంతభేరి

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము:50 **జూలై 2017** **సంచిక: 07**

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1500/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు , విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు :

శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్: 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

వేదాంతభేరి

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము:50 **జూలై 2017** **సంచిక: 07**

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. ఆత్మానుభూతియే జీవితలక్ష్యము - 06
03. కారణ జన్ములు - శ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు - 09
05. సాధన - శ్రీ సద్గురు మలయాళస్వాములవారు - 11
06. గిరిశబ్దాన్త నామధారీ - మహామండలేశ్వర్ శ్రీ కాశికానందజీ - 15
07. శ్రీ మలయాళయతీంద్రగీత సమాజసంస్కరణ - డా॥సముద్రాల లక్ష్మణయ్య- 20
08. పరమగురువులు శ్రీ మలయాళసద్గురుస్వాములవారు- బ్రహ్మచారి శ్రీవిజయానంద- 26
09. జ్ఞానసుధ - సర్పభూషణ శ్రీ శివయోగిగారు - 28
10. చిన్మయ ఉత్తరం - - 30
11. శ్రీరామానుజుల తిరుమల తిరుపతి దేవస్థానముల నిత్య కైంకర్యములు - డా ॥ బత్తల శ్రీరాములు - 34
12. శ్రీ మదాంధ్ర మహాభాగవతము -ఆచార్య జక్కంపూడి మునిరత్నం- 37
13. వార్తలు - 42

ముఖచిత్రం :

గురువులకు గురువు శ్రీ దక్షిణామూర్తి

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

1. ఓం యోగీన్ద్ర హృదయామ్భోజ విషణ్ణ మపవర్గదం ।
నమామి దక్షిణామూర్తిం ప్రణవాత్మ స్వరూపిణమ్ ॥

2. ఓం నమః ప్రణవార్థాయ శుద్ధజ్ఞానైకమూర్తయే ।
నిర్మలాయ ప్రశాన్తాయ దక్షిణామూర్తయే నమః ॥

3. ఓం గురవే సర్వలోకానాం భిషజే భవరోగిణాం ।
నిధయే సర్వవిద్యానాం దక్షిణామూర్తయే నమః ॥

* * * * * * *

4. ఓం వ్యాసాయ యతివర్యాయ విద్యా విగ్రహధారిణే ।
నమస్తే పరమానన్దదాయినే పరమాత్మనే ॥

5. ఓం వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।
నమోవై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥

6. ఓం మునిం స్నిగ్ధాంబుదాభాసం వేదవ్యాసమకల్మషం ।
వేదవ్యాసం సరస్వత్యాఽవాసం వ్యాసం నమామ్యహమ్ ॥*

* * * * * *

7. ఓం నమస్తే భక్త సమ్రాజ్య సమ్యగ్ జ్ఞానవతాంవర।
భక్తేచ్ఛోపాత్తరూపస్త్వం గురుదేవ ! నమోఽస్తుతే ॥

8. ఓం అసజ్ఞానన్ద ! యోగీశ ! సద్గురో ! పూత భావన ।
జితకామ ! సదాశాన్త ! నమస్తే త్యాగిసత్తమ ॥

9. ఓం బ్రహ్మాత్మభావసమ్పూర్ణ బ్రహ్మజ్ఞానప్రబోధక ।
నమస్తే సచ్చిదానన్ద రూపిణే పరమాత్మనే ॥

4-7-2017 ఆషాఢ శుద్ధ ఏకాదశి
శ్రీ సద్గురు మహర్షి మలయాళస్వాములవారి ఆరాధన
9-7-2017 తేది ఆదివారం గురుపూర్ణిమ



ఆత్మానుభూతియే జీవిత లక్ష్యము

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

అధ్యాత్మ క్షేత్రమున అనుభవమునకు గొప్ప ప్రాముఖ్యత కలదు. పరమార్థవిద్య నూటికి 95 వంతులు అనుభవాత్మకమే అయియున్నది. మౌఖిక జ్ఞానమునకు కొంత విలువయున్నను, దానితో ఎవరును సంతృప్తి బొందరాదు, అనుభూతిని తప్పక బడయవలయును.

ఒకానొక మామిడి తోటలోనికి ఇరువురు మిత్రులు వెళ్లిరి. అందొకడు ఒక్కొక్క చెట్టు యొద్దకు వెళ్లి దాని ఆకులను లెక్కించుచు కాయలను పరీక్షించుచు పోవుచుండెను. మఱియొకడు ఒక పండుని కోసుకొని ఒకమూల కూర్చుని తినుచుండెను. వీరిరువురిలో ఎవరు సుఖవంతుడు ? చెట్లయొక్క వివరములను గైకొనువాడా ? పండు అనుభవించువాడా ! అట్లే ఆధ్యాత్మికతత్త్వములను అనుభవమునకు తెచ్చుకొనువాడే ధన్యుడు, కృతార్థుడు, కృతకృత్యుడు. జ్ఞానముతోబాటు విజ్ఞానము గూడ సముపార్జించవలెనని గీతాచార్యుడు సుస్పష్టముగ పేర్కొనియుండుటను ముముక్షువులు జ్ఞాపకము చేసికొనవలసియున్నది. వినిన దానిని స్మృతికి తెచ్చుకొని దానిని అనుభవములోనికి పరిణమింపజేసికొనుట విజ్ఞుల కర్తవ్యము. వాచాజ్ఞానముతో పరితృప్తి నొందియుండుటవలననే జనుల హృదయాంతరాళములో ఋషులు బోధించిన యా పరమ సత్యములు అనుభవమునకు రాకయున్నవి.

' Man must realise God, feel God, see God, and talk to God. That is Religion '.

“ మానవుడు భగవంతుని సాక్షాత్కరించుకొనవలెను, అనుభవించ

వలెను, దర్శించవలెను, మాట్లాడవలెను – అదియే మతము ” అని వివేకానందుల గంభీర ప్రవచనము. కాబట్టి అనుభూతి కలుగువఱకు సాధనను కొనసాగించుచునే యుండవలెను.

వారివారి సాధనల తీవ్రతనుబట్టి, పట్టుదలనుబట్టి కొందఱికి ఆ దైవానుభూతి శీఘ్రముగ లభించవచ్చును. మఱికొందరికి కొంతకాలము పట్టవచ్చును. కాని ఏ నాటికైనను జీవుడు శివుడు కాక తప్పదు. నరుడు నారాయణుడుకాక తప్పదు. ప్రయత్నము మాత్రము కుంటుపడరాదు.

ఎన్నియో అనుకూలములతోగూడి దేవతలకు కూడ లభ్యముకాని అవకాశములు గల్గియున్న ఈ మానవ జీవితమున మనుజుడు తన నిజస్వరూపమగు పరమానందమును చవిచూడనిచో, దుఃఖమును అంతమొనర్చుకొననిచో జీవితమున కేపాటి విలువ యుండగలదు ? కోట్ల కొలది యోనులలో తిరుగాడి ఇప్పటికే జీవుడు విసిగి వేసారియున్నాడు. కాబట్టి ఇక ఏ మాత్రము విలంబనము చేయుట తగదు. తన జన్మహక్కైన పరమాత్మ పదవిని శీఘ్రాతిశీఘ్రముగ చేరవలసి యున్నాడు. బ్రహ్మానంద అనుభూతిని సత్వరమే పడయవలసి యున్నాడు. ‘ ఇక తల్లిపాలు మరల త్రాగను’ అని భీష్మప్రతిజ్ఞ గైకొనవలసి యున్నాడు.

ఒక్కొక్క సాధనను ప్రారంభించి శ్రద్ధతో, విశ్వాసముతో దానిని కొనసాగించుచు హృదయములో మార్పుకలిగినదా యని అపుడపుడు పరీక్షించుకొనుచుండవలెను. అసురసంస్కారములు తొలగి దైవ సంస్కారములు ప్రవేశించినవాయని చూచుకొనుచుండవలెను. ప్రతిదినము ఉదయమునగాని, సాయంసమయమునగాని, లేక అనుకూలమైన తదితర సమయములందుగాని, విధిగా కొంతసేపు ధ్యానమును అభ్యసించవలెను. ప్రాపంచిక భోగవిలాసములయెడల అరుచిని కలిగించు కొనవలెను. ఏలయనగా మనస్సు భోగైశ్వర్యముల కాంక్షచే బయటకు లాగివేయబడు

చున్నపుడు ధ్యానమందు, సమాధి నిష్ఠయందు నిలవనే నిలవదు. కాబట్టి ఆత్మానుభూతిని కాంక్షించు ముముక్షువు విషయభోగములందు విముఖత్వము కలిగి యుండవలెను. దైవానుభూతికి విషయవిరక్తి మొదటి మెట్టని గ్రహించవలెను.

ఈ ప్రకారముగ చిత్తమున వైరాగ్యభావము గలవారై ప్రతిదినము నియమ పూర్వకముగ కొంతసేపు ధ్యానమును అభ్యసించుచుండినచో అచిరకాలములోనే జనులకు పరమశాంతి, ఆనందానుభూతి కలుగ గలవు. ఆత్మయందు నిలకడ ఏ కొంచెము లభించినప్పటికిని ఇక ఆ స్థితిని వదలిపెట్టుటకు జీవునకు మనస్కరించదు. తల్లిపాలు త్రాగుచున్న దూడను త్రాటితో లాగినను అది యెట్లు రాకుండునో అట్లే ఆత్మానందరసాస్వాదన మొనర్చు జీవునకు బహిర్ముఖత్వము, విషయానుభవము కర్ణకంటకముగ తోచుచుండును. ఏ ఆనందముయొక్క లవలేశము ఇంద్రానందము, చతుర్ముఖానందములకంటె ఎన్నియోరెట్లు అధికముగనుండునో, అట్టి ఆనందసారముయొక్క పరిచయము, అనుభవము బడయుచున్న జీవుని ఇక ఏ దృశ్యసౌఖ్యము ఆకర్షింప జాలదు.

అట్టి మహోన్నత ఆత్మానుభూతియే సమస్త జీవులయొక్క చరమలక్ష్యము. అద్దానిని ఈ పవిత్ర మానవజీవితము నందే సాధించి వేయుట ఉత్తమము. కావున సమయమును వ్యర్థము చేయక నిరంతరము ఏదియో యొక పరమార్థ అభ్యాసమును శ్రద్ధాభక్తులతో ఆచరించుచు. ఈ జన్మముననే భగవదనుభూతిని తప్పక బడయ వలయునను కృతనిశ్చయముతో ప్రవర్తించినచో అచిరకాలములోనే లక్ష్యప్రాప్తి చేకూరి జీవితము ధన్యము కాగలదు. మోక్షము కరతలామలకము కాగలదు.

కారణ జన్ములు

(సద్గురు స్వాములవారి ఆరాధన సందర్భంగా)

- శ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు

శ్రీ సద్గురు మహర్షి మలయాళస్వాములవారు (శ్రీఅసంగానందగిరి స్వాములవారు) కారణ జన్ములు. ఆంధ్రదేశంలోని మనందరిని, తత్రాపి మహిళామణులను ఆధ్యాత్మికంగా ఉద్ధరించడానికి అవతరించిన మహాపురుషులు. శ్రీవారు కారణజన్ములు కాబట్టే వారికి ప్రారబ్ధాది కర్మలు లేవు. మల దోషాదులు అసలే లేవు. అందుచేత వానిని పోగొట్టుకోడానికి వారు తపస్సు చేయలేదు. కేవలం మనకు ఆదర్శంగా వుండడానికే, మనకోసరమే వారు గోగర్భంలో తపస్సు చేశారు.

పూజ్యశ్రీ స్వాములవారు నాటి కాలపరిస్థితులలో ధనబలము, జనబలము, స్థలబలము లేకపోయినా తన తపోబలంతో మూఢాచారాలను మూర్ఖవాదనలను, శుష్క వేదాన్తాలను ఖణ్డించి దేశానికి వెన్నెముక ఐన గ్రామాలను పవిత్రం చేశారు. గ్రామీణులలో ధార్మిక జాగృతిని కలుగ జేశారు. కులగజ్జిని దూరీకరించి గ్రామీణ మహిళామణులను వేలకు వేలను తయారుచేసి వారందరిచే నిర్దుష్టంగా ఏకస్వరంతో గీతా పారాయణలను చేయించి గ్రామ కాలుష్యాలను, వర్ణ, వర్గ కాలుష్యాలను దూరీకరించారు. పవిత్ర వాతావరణాన్ని సృష్టించారు. ఇది ఆనాటి పరిస్థితులలో సామాన్యుడు చేయలేడు. కేవలం స్వతః సిద్ధపురుషుడైన, మహర్షి అయిన శ్రీ స్వామి ఒకరే చేయగలిగినారు. వారి కృపవలననే నేడు మనందరం సన్న్యాసులుగా మన గల్గుతున్నాము.

అట్టి పూజ్యపాద స్వాములవారి ఉపదేశాలను, ఆదేశాలను, ఆచరణలను మనం స్వయంగా ఆచరించి మన అనుయాయులందరిచే
I అనుష్ఠింప చేయడమే నేటి మన కర్తవ్యము.

III
IV

శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో ప్రథమ జ్ఞాన సదస్సు

5-6-2017 తేది జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి సోమవారం నుండి 9-6-2017 పౌర్ణమి శుక్రవారం వరకు 5 రోజులు **ప్రథమ జ్ఞాన సదస్సు** ఆశ్రమంలో జరిగినది. **ఆచార్యులుగా పూజ్యశ్రీ స్వస్వరూపానందగిరి స్వాములవారు** (వసిష్ఠాశ్రమాధిపతులు, శ్రీనివాస మంగాపురం సదస్సులకు ఉదయం 9 గం॥ల నుండి 10-30 గంటల వరకు **పంచభ్రమ నిరూపణను** గురించి సాయంకాలం 4 గం॥ నుండి 5-30 గం॥ వరకు **స్థిత ప్రజ్ఞ లక్షణాలను** గురించి **సవివరంగా** ప్రవచన చేశారు. మంచి విద్యావంతులు 18 మంది సదస్సులో పాల్గొనినారు. చివరిరోజున శ్రోతలు - సదస్సులో పాల్గొనినవారు ఇందులో పాల్గొనినందులకు ఆచార్యుల ప్రవచనా శైలికి చాలా సంతోషాన్ని ప్రకటించారు. **ఆచార్యులు పూజ్య శ్రీ స్వస్వరూపానందగిరిస్వాములవారికి** ఆశ్రమ పీఠాధిపతులు పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు సన్మానం చేశారు.

ద్వితీయ జ్ఞాన సదస్సు

ద్వితీయ జ్ఞాన సదస్సు జూలై 4వ తేది ఆషాఢ శుద్ధ ఏకాదశి నుండి జూలై 8వ తేది పౌర్ణమి వరకు 5 రోజులు శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో జరుగును. **ఆచార్యులుగా పూజ్యశ్రీ మాతా పరావిద్యానన్దగిరిస్వామివారు** (యాజ్ఞవల్క్యాశ్రమాధిపతులు, యాచారం) ఇందు పాల్గొని **ఈశావాస్యోపనిషత్తుపై** ప్రవచన చేస్తారు. సదస్సు ఉదయం మఱియు సాయంకాలం రెండు పూటలా జరుగుతుంది. ఇందు పాల్గొను సాధకులకు నివాస వసతి, భోజన వసతి ఉచితంగా ఏర్పాటు చేయబడును.

- ఆశ్రమ పరిపాలనా సంఘము

సాధన

– శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

పూర్ణమగు ఇంద్రియనిగ్రహము, మనోజయము, ఆత్మ సంయమము గలుగనంతవఱకు తన ప్రయత్నమును విడనాడక ఏకాంతమున సాధనల చేయుచుండవలయును.

మనస్సు చేయు చేష్టల నేకాంతముగ కూర్చుండి జాగ్రతతో నిరీక్షించుచుండిన మనోజయము త్వరలో సిద్ధించును.

నిర్మలమగు ప్రదేశమున ఎక్కువ ఎత్తుగను, నిండా తక్కువగను లేని, సుఖమును గలుగజేసెడి ఆసనమందు ఆసీనుడై ప్రణవమును ధ్యానించుచూ ప్రణవార్థమగు పరబ్రహ్మమునందు నిలకడ గలిగేలాగున అభ్యసింపవలయును.

ఈ బాహ్యాకాశము నుండి క్రమముగ శ్వాస ద్వారా ప్రాణమును ఆత్మస్థానమున జేర్చి లయ మొనర్పవలయును. ఈ శ్వాస ఎచట లయమొందునో అచ్చోటనే ఈశ్వర ధ్యానము చేయవలయును. నాదము, శ్వాస ఎచట లయమగునో అదియే పరబ్రహ్మస్థానమని చెప్పబడినది.

ఇడా–పింగళ–సుషుమ్న లను మూడు ముఖ్యమైన నాడులు శరీరమునందు గలవు. అందులో సుషుమ్న ప్రధానమైనది. అది బ్రహ్మ రంధ్రము వఱకు వ్యాపించియుండును. ఈ సుషుమ్నామార్గమున మనస్సును సంయమనము చేసిన, అచ్చట ప్రణవనాదము వినవచ్చు చుండును. ఆ నాదబ్రహ్మమునందు మనస్సును లీనముచేసినచో బాహ్య ప్రపంచ వినోదమున భ్రమ (ఆసక్తి) నివృత్తియగును. తదుపరి అభ్యాస యోగముచే క్రమముగ నాదబిందుకళాతీతమగు ప్రత్యగాత్మయందు చిత్తమేకమగును. ఇదియే చిత్తైకాగ్రత.

ప్రథమమున సగుణధ్యానము, తరువాత నిర్గుణధ్యానము నవలంబించుట మంచిది. పూజామందిరమున మహాత్ముల పటములను గానీ, విగ్రహములనుగానీ ఉంచవలయును. మూర్తియందు మనస్సు లీనము కానంతవరకు అది గోచరించుచునే యుండును. ఆపిదప ఉండినను గోచరింపదు. అట్లే దేహమందిరమునగాని, ఆకాశమున సోమమండలమునగాని, సూర్యమండలమందుగాని మనస్సును నిలపి నిశ్చలబుద్ధితో ధ్యానము చేయవచ్చును. లేక శివరూపమును ధ్యానించ వచ్చును. లేక విశ్వాకారుడగు నారాయణమూర్తిని 'సహస్ర శీర్షః' పురుషః, అను ప్రకారము ధ్యానింపవచ్చును. ఈ ధ్యానమే బాహ్యమున బ్రహ్మాండమును లక్షించి చేసిన కొన్ని సిద్ధులను బడయవచ్చును. తన హృదయ మధ్యమున అష్టకళలతో నిండిన ఈశ్వరుని ధ్యానించవచ్చును. భ్రూమధ్యమున లక్ష్యము నుంచి ధ్యానించవచ్చును. వీని యన్నింటికంటే స్వస్వరూప ధ్యానము మిన్న.

మనోనిగ్రహము నొనర్పదలంచువారుగాని, ధ్యానమును శీలించువారుగాని ప్రారంభదశయందు నేత్రముల మూసికొనుటయే మంచిది. అయితే నేత్రములు తెఱచుకొని చేయు ధ్యానమే గొప్పది. కానీ అది అందఱికిని మొదట సాధ్యము కాదు. అట్లు కనులు తెఱచి కొనునపుడు దృశ్యస్ఫురణ గలుగనిచో మాత్రమే అది సఫలమగును. లేనిచో మూసి చేయుటయే శ్రేష్ఠము.

అభ్యాసము లేనివారికి నేత్రములు మూసికొనుట యను అమావాస్య దృష్టి ధ్యానకాలమున బాగుగ యుపకరించును. కొంత అభ్యాసముగలవారికి అర్ధచూపుగల్గి భ్రూమాధ్యమున దృష్టిని నిలుపుట యను పాడ్యమి దృష్టి మంచిది. ఆరూఢులు, ధ్యానమందు పరిపక్వస్థితి నొందినవారు సామాన్యముగ నేత్రములు తెఱచుకొనియే ధ్యానము చేయుదురు. ఇది పూర్ణిమదృష్టి.

అందరును ఒకే లక్ష్యమందు మనస్సును నిలపి ధ్యానము చేసిన,

ఒకే శబ్ధంతో మంత్రోచ్ఛారణ చేసిన ఆ శుద్ధాణువులన్నియు ఏకాకారమై ఒకవిధమైన మహత్తరశక్తి నుద్భవింపజేయును. కావున ఒక సమాజములో నున్నవారు ప్రార్థనాదికాలములందు ఒకేచోట సమావేశమై ఆయా కార్యముల నెరవేర్చినచో యితరుల వలన ఏ యాటంకములున్ను గలుగవు. భూత ప్రేతపిశాచాదులున్ను బాధింపవు.

ఒక్కొకమంత్రము నుచ్చరించునపుడు ఒక అపూర్వమైన తేజస్సు తనలో ప్రవేశించి తనను పరిశుద్ధ మొనర్చుచున్నట్లు, దేహ మంతయు చైతన్యమయమైనట్లును భావన చేయవలయును. అట్లే మంత్రార్థమును గూడ భావింపవలయును.

భగవద్ధ్యానమందు యున్నంతవఱకు జీవుని హృదయ కమలము ప్రకృతిమాతచే వికసింపజేయబడి ఊర్ధ్వముఖమై యుండును. కానీ అది తెగి ధ్యానభంగమైనచో ఆ ప్రకృతిమాతయే హృదయకమలమును ముకుళితమొనర్చి అధోముఖముగజేసి వినాశ మొనర్చును. అపుడు జీవుడు పతితుడై పోవును. కావున సదా ధ్యానపరుడవుగమ్ము.

పరాన్నము భుజించువారు తగిన బ్రహ్మనిష్ఠ గలిగియుండనిచో తమ పుణ్యమును గోల్పోవుదురు. అపుడు వారికి కోపతాపములు వృద్ధియగును. కఠినవాక్కు యలవడును. ద్వేషము పెరుగును. ఇట్టి లక్షణములు గల్గుచుండిన పుణ్యము క్షయించుచున్నదని తెలిసికొని తీవ్రముగ ధ్యానము చేయవలయును.

పరమేశ్వరుని అనన్యభక్తితో ధ్యానించువానికి భగవంతుడు తన మాయ అనే ఆవరణను దొలగించి తన నిజస్వరూపమును ప్రత్యక్షీకరింప జేయు చున్నాడు.

మామిడిపండు పండిన తర్వాత అందు తీపియే యుండును, కానీ వగరు, పులుపు మొదలగునవి యుండవు. లేతకాయకు, తెగులుచే రాలిన కాయకు మాధుర్యముండదు. అట్లే ధ్యానముచే పరిపక్వచిత్తులకు సదా ఆనందమే యుండును. గాని అపరిపక్వచిత్తులు తమ కింకను పక్వావస్థ కలుగలేదని తలంచి మరింత ధ్యానం చేయవలెను.

జీవుడా! మేలుకో!!

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

ఘోరమైనది సాగరంబన్నా
సంసార మెంతయు, భీకరంబుగ తోచుచుండునురా
కామ క్రోధ మకరములతో
భీషణంబగు సాగరంబును
దైవసేవను పడవచేతను
లీలగా భువి దాటివేయుము.
తత్త్వసారము తెలిసికోరన్నా
సద్గురునిచెంత, నిజము గనుగొని లాభమొదన్నా 103

అనాదికాలము నుండి జీవుడు సంసారసాగరమున, దుఃఖ సాగరమున బడి దిక్కుతోచక నానాబాధలు నొందుచున్నాడు. ఒకపుడు కామమను మొసలి నోటిలో చిక్కుపడుచున్నాడు. మరొకపుడు క్రోధమను తిమింగలములతో కొట్టబడి అధోగతిపాలగు చున్నాడు. ఇంకొకపుడు ధనధాన్యాదులయెడల లోభత్వ బుద్ధిచే పాతాళము వరకు అణగ ద్రొక్కబడుచున్నాడు. ఇంకను దంభము, దర్పము, మాత్సర్యము, తృష్ణ, పరుషత్వము, కఠినత్వము మున్నగు దుర్గుణరూప జలచరములచే బాధల నొందుచు భీషణమగు భవసాగరమున దరిగానలేక శాంతి నొందజాలక నరకయాతనలను అనుభవించుచున్నాడు.

కావున ఓ మానవుడా! ఓ జీవుడా! మేలుకో! నీ యొక్క దీనస్థితికై విచారించు. ధైర్యవంతుడవై ఘోరసంసార సాగరమునుండి వెలువడుటకు మార్గమును అన్వేషించు. దైవసేవ అను పడవను సంపాదించు. సద్గురు దేవుడను నావికుని ఆశ్రయించు. భక్తి, శ్రద్ధ, వినయములతో సద్గురువును, మహాత్ములను సేవించు, మరల ఈ దుఃఖసముద్రమున, భవసాగరమున పడకుండులాగున గట్టి ప్రయత్నముచై. నీ నిజస్వరూపమును తెలుసుకో. దేహాత్మభావనను ఆత్మభావనచే తొలగించుకో. స్వాత్మసామ్రాజ్యమున, మోక్షధామమున ప్రవేశించు. పరమశాంతిని ఆస్వాదించు.

వేదాన్తభేరి మురళీధర కృష్ణుడు
ollow the master

గిరి శబ్దాన్త నామధారీ

- అనంతశ్రీ విభూషిత, మహామండలేశ్వర్,

- శ్రీ స్వామీ కాశికానందజీ మహరాజ్

- శ్రీ ఆనందవనాశ్రమము, బొంబాయి

త్యాగము, తపస్సు, వైరాగ్యము, ఆధ్యాత్మిక పరమైన ఈ సాత్విక విభూతి దివ్య సౌందర్యముగా రూపొందిన మహర్షులు శ్రీ అసంగానందగిరి స్వాములవారు. మన మలయాళ స్వాములవారు భగవత్పాదులు శ్రీ శంకర సంప్రదాయానికి చెందిన"దశనామ"సన్న్యాసులలో ఒకరైన గిరినామములోని వారు మన సద్గురు మలయాళస్వాములవారు.

వాసో గిరివరే నిత్యం గీతాధ్యయనతత్పరః ।

గంభీరాచలబుద్ధిశ్చ గిరినామ స ఉచ్యతే ॥

పర్వత ప్రదేశాలలో నివాసము, నిత్యమూ గీతాధ్యయన తత్పరత, గంభీర అచల బుద్ధిమంతులు గిరి నామ సన్న్యాసులు॥

పై శ్లోకంలోని అర్థాన్ని శ్రీ స్వాములవారు తమ జీవితంలోకి అందంగా, శుచిగా అవతరించుకొన్నారని అనడంలో అతిశయోక్తి లేదు. తిరుపతి కొండల్లో – గుహల్లో అనేక సంవత్సరాలు స్వాములవారు తపస్సు చేశారు. వారుండిన వ్యాసాశ్రమం కొండ చరియలోనే వుంది. గీతను నిరంతరం అధ్యయనం చేస్తూ ఉండేవారు. అంతేకాదు – " అధీతి బోధాచరణ ప్రచారైః అన్న ఆదర్శానికి అనుగుణ్యంగా గీతను బోధిస్తూ, ప్రచారం చేస్తూ త్రికరణ శుద్ధిగా ఆచరిస్తూ ఉండేవారు. స్వాధ్యయనంతోపాటు ఆత్మస్థానమైన హృదయ గహ్వారం నుంచి దివ్య నిస్వనబోధ – స్పర్శలను గ్రహిస్తూ జీవితంలో విశుద్ధ ఆచరణ సంపదను

నిండుగా నింపుకొన్నారు. స్వాములవారి గంభీరత –దృఢనిశ్చయాలు ఆంధ్రులకు సుపరిచితాలు.

1960లో దక్షిణ భారతంలో పర్యటిస్తూ ఉన్నప్పుడు ఏర్పేడు పరిసరాల్లోని వారి ఆశ్రమంలో శ్రీ స్వాములవారిని దర్శనం చేసుకొన్నాము. వారిలోని గాంభీర్యం అద్భుతమైంది. వారు తక్కువగా మాట్లాడుతారు. కాని ఆ మాటల్లోని అర్థాలు చా[illegible]లో స్వాములవారి వ్యక్తిత్వం యొక్క ప్రభావం ఎంతగా ఉన్నదంటే ఆశ్రమవాసులలో ఏ ఒక్కరిలోనూ వాచాలత కనిపించదు. మితంగా, శుచిగా మాట్లాడేవారు. అందరూ కఠోర క్రమశిక్షణ పాటించేవారు. ఇంత క్రమశిక్షణ మరెక్కడా ఆశ్రమాల్లో మేము చూడనేలేదు.

ఎవడు బ్రాహ్మణుడు ?

మూలం – బుద్ధుని ధర్మపదం

అనువాదం – బ్రహ్మచారి ఆనందమోహన్

హాస్యము, నవ్వులు, ఎగతాళి అనేవి అంటరానివిగా ఆశ్రమానికి దూరంగా బయటికి తరిమివేసినట్లు కనిపించింది. జిజ్ఞాసులు, ముముక్షువులు ఆత్మచింతనలో నిమగ్నులై ఉండేవారు. విద్యార్థులు విద్యాధ్యయన తత్పరులై ఉండేవారు. ఆశ్రమ కార్యకర్తలు తమకు విధించిన కార్యాల్లో సంలగ్నులై ఉండేవారు. శ్రీ స్వాములవారు నిరాసక్తులై తమ పూరి కుటీరంలో ఆనందవశులై ఉండేవారు. ఇతరులు తమ – తమ స్థానాల్లో ఉండినా స్వాములవారి ప్రభావం ఆశ్రమం అంతటా ఉండేది. వారి అత్యంత సరళమైన, కాని అతి గంభీరమైన పుణ్య జీవన –స్రవంతిలో అందరూ తాదాత్మ్యం పొంది ఉండేవారు.

శ్రీ మద్భాగవతంలోని శ్రీ దత్తాత్రేయులవారి ఉపదేశాల్లో –

మునిః ప్రసన్న గంభీరో దుర్విగాహ్యోదురత్యయః

అనంతపారో అక్షోభ్యః స్థిమితోద ఇవార్ణవః

" మునులు ఎప్పుడూ ప్రసన్నవదనులుగా ఉంటారు. గంభీరభావాలు – లోతైన ఆశయాలూ వారి ముఖంపైన ప్రతిఫలిస్తూ

ఉంటవి. ఎవరూ వారి స్థితిని అతిక్రమించలేరు. ఎట్టి స్థితిలోనూ వారి మనస్సు క్షోభించదు, – అని చెప్పబడి ఉన్నది.

తిరుమలలో శ్రీ స్వాములవారు తపస్సు చేసుకుంటున్నప్పుడు వారి కృపాదృష్టిపాతం కోసం అనేకమంది వారి కడకు వచ్చేవారని మేము విన్నాము. ఈ ఆశయానికి విరుద్ధంగా సత్కార్యాలను విఘ్నపరచి సంతోషం పొందే ఆసురస్వభావులు ఛిద్రాన్వేషులు (తప్పులు వెతికేవారు)న్ను వారివద్దకు వచ్చేవారనీ విన్నాం. శ్రీస్వాములవారు అక్కడ ఉండడం స్వార్థపరులకు అడ్డంగా ఉండేది. అయినా అట్టివారి చర్యలపట్ల శ్రీవారు ఎప్పుడూ ఉద్రేకం చెందేవారు కారు. నదులు వచ్చి తనలో చేరినపుడు సముద్రం పొంగిపోతూన్నదా ? అవి రానందున అది ఎండి పోతున్నదా ? ఈ ఆసుర మనోసంచారులు, వారి వద్దకు వచ్చినా మరేదైనా చేసినా వారి అంతరిక ప్రశాంతత అచలంగానే ఉండేది. వారికి ఎలాంటి మనోవికారం కలిగేది కాదు.

శ్రీ స్వాములవారు తిరుమల దిగి క్రిందికి వచ్చారు. ఈసందర్భాన్ని తాను ఘనకార్య పరిణామంగా భావించారు. ఆ అల్పులు, అసురులు, దుష్కార్యశూరులు, శ్రీరామ చంద్రుణ్ణి అడవులకు పంపి తాను నడిపిన వ్యూహం ఫలించిందని కైకేయి భావించింది కదా ! కాని నిజానికి రాముడు అడవులకు పోవడం కైకేయి వలన కాదు – "రావణాది దుర్మార్గులను సంహరించటానికి మీరు అవతరించారు. అట్టి మీరు రాజ్యసింహాసనంపైన ఆసీనులై ఉంటే ఈ ఘనకార్యాన్ని సాధించి పెట్టేది ఎవరు ? ధర్మాన్ని పునః స్థాపించేది ఎవరు?" అని అమృతలోకవాసులు దేవతలు భగవదతారుడైన శ్రీరామచంద్రుణ్ణి ప్రార్థించారు. అందుకే శ్రీరాముని వనవాసం. అచట కైకేయి –ఇచట స్వార్థపరులు కొందరు కేవలం

నిమిత్తమాత్రులని మీరు గ్రహించగలరు. సమాజంలోని నిరక్షరాస్యుల హృదయాల్లో జ్ఞాన దీపికలను వెలిగించి ఆధ్యాత్మిక జీవన చైతన్యపై వెలుగులను నలుమూలలకు వ్యాపింపచేయటానికే శ్రీవారు జన్మించారు. అందుకే వారు తిరుమల దిగివచ్చింది. ఇదొక అనివార్య సంఘటన. శిష్యులు సన్న్యాసాన్ని స్వీకరించేపుడు తపస్సు కోసం అని హిమాలయం వైపు ఏడు అడుగులు ముందుకు వేస్తారు. గురువులు, ఆచార్యులు శిష్యులును "ఆగు" అని సంబోధించి ఇలా అంటారు– "లోక కల్యాణార్థం వస్త్రధారణ చేయండి, జనులకు కల్యాణపథాన్ని నిర్దేశించండి"అని.

సన్న్యాసులైన ఆ మహాత్ములు జనకల్యాణార్థం గ్రామసీమల్లోకి, నగరాల్లోకి వెళ్ళుతారు. అలాగే శ్రీ స్వాములవారు ఆంధ్రదేశంలో తన ఆధ్యాత్మిక ప్రచార ఉద్యమాన్ని తేజోవంతంగా నడిపారు. ఏతత్ఫలితాలు– పరిణామాలు అదృష్టవంతులైన మీకు–ఆంధ్రులకూ బాగా తెలుసు.

ఈ "గిరి" నామం చిరకాలంగా వ్యవహారాల్లో ఉన్నదే. ఈ సంప్రదాయంలో చాలా మంది మహావిద్వాంసులు, మహ తపస్వులు ఉన్నారు. కృష్ణకర్ణామృత రచయిత బిల్వమంగళాచార్యులు తన మంగళా చరణంలో–

"చింతామణిర్జయతి సోమగిరిర్గురుర్మే"

తన గురువుగారైన సోమగిరివారు చింతామణిరత్నంతో సమానంగా, తేజోవంతంగా చింతనం చేసేవారు అని వ్రాశారు.

కొందరు 'చింతామణి' ఒక స్త్రీ పేరు అని అంటారు, కాని అట్లు చెప్పినపుడు "సోమగిరి" శబ్దంతో అభేదాన్వయం సంభవం కానందుచేతను మంగళాచరణంలో అమంగళం అనుచితమగుటచేతను ఇచట చిన్తామణి స్త్రీ కాదు.

ఉత్తర భారతంలో 'గిరి' శబ్దాంత నామధారులైన సన్న్యాసులు

చాలామంది ఉన్నారు. శంకరుల కాలంనుంచి వస్తున్న ఆశ్రమాల్లో "గిరినామ" సన్న్యాసులు అధికంగా వున్నారు. వాళ్ళు దేశరక్షకులుగాను, శాస్త్రరక్షకులుగాను, జనకల్యాణకారులుగాను ప్రఖ్యాతులయ్యారు. అలాంటి రత్నాలలో శ్రీ అసంగానందగిరి స్వాములవారు అంటే శ్రీ మలయాళమహర్షులవారు అన్యతములు. నేటి సమాజ కల్యాణానికి కారణం అయిన ఈ వ్యాసాశ్రమం వారి సత్సంకల్ప పరిణామం అని చెప్పక తప్పదు. శ్రీ స్వాములవారి ప్రఖ్యాత శిష్యులు శ్రీ విమలానంద స్వాములవారు కాశిలో మా అధ్యయన కాలంలో మాతోపాటు అధ్యయనం చేస్తూ ఉండేవారు. అపుడు వారిపేరు శ్రీకృష్ణచరణ్. ఆయన స్థానంలో ఇపుడు శ్రీ విద్యానందగిరిస్వాములవారు ఉన్నారు. ఆంధ్రదేశంలో వాడ వాడలో, ఇంటింటిలో శ్రీ మలయాళ మహర్షి యొక్క సత్సంకల్పాన్ని అందంగా స్వచ్ఛంగా రూపొందేలా శ్రీ విద్యానందగిరి స్వాములవారు శ్రమిస్తారని "గిరి" నామాన్ని సార్థకం చేస్తారని జనులు ఆశిస్తూ ఉన్నారు. **ఓం తత్ సత్**

హిందీ నుండి శ్రీ పి.నాగభూషణమ్ గారిచే అనువదించవడినది.

(శ్రీ మలయాళస్వామి శతజయన్తి సంచిక నుండి)

Om

The Vritti or the state of mind that destroys Avidya is called Vidya or wisdom. Those that possess such wisdom are considered to be well versed in all the Sastras, though they are unlettered, but those who are erudite without realising their Atman are termed as ignorant.

- Sadguru Maharshi Malayala Swamiji

శ్రీమలయాళయతీంద్రగీత సమాజసంస్కరణ

- డా ॥ సముద్రాల లక్ష్మణయ్య,
(తిరుపతి)

ఇటీవల మనం ఒక సంవత్సరకాలం శ్రీ భగవద్రామానుజుల సహస్రాబ్ది -ఉత్సవాలను జరుపుకొన్నాం. వెయ్యి సంవత్సరాల తరువాత ఆ మహానుభావుణ్ణి స్మరించుకొన్నామంటే ఆయనలో ఒక అపూర్వమైన విశిష్టత, వ్యక్తిత్వం ఉండాలి. పుట్టి గిట్టిన ప్రతివ్యక్తికీ జయంత్యుత్సవాలు జరుపము కదా !

శ్రీరామానుజులు నాటి సమాజంలో వ్రేళ్ళూనుకొని ఉండిన మూఢవిశ్వాసాలను తొలగించడానికి పూనుకొని సమాజాన్ని సరి అయిన త్రోవలో నడిపించడానికి ఉద్యుక్తులయ్యారు. అస్పృశ్యత తగదన్నారు. భగవదుపాసనకు అందరికీ అర్హత కలదన్నారు. శరణాగతి మార్గాన్ని అనుసరించి అందరూ తరించవచ్చునన్నారు. మత వైషమ్యాన్ని రూపుమాపడానికి చిత్తశుద్ధితో కృషి చేశారు. ఈ కారణాల వల్లనే మనం ఈ నాటికీ వారిని స్మరించుకొంటున్నారు. వారి నారాధించి ధన్యులమయ్యామని భావిస్తున్నాం.

లోకోద్ధరణాత్మకమైన ఈ సంస్కరణ విధానాన్ని శ్రీరామానుజుల తరువాత గూడా కొందరు మహనీయులు కొనసాగించారు. అట్టి పవిత్ర చరిత్రులలో మనకు అత్యంత సన్నిహితులైన శ్రీ మలయాళ యతీంద్రుల వారొకరు, శ్రీ సద్గురు స్వాములవారి సేవలు ఆంధ్రావనిలో బహుముఖాలుగా విస్తరించాయి. వారు గావించిన ప్రతిచర్యా సమాజోద్ధరణకే ఉద్దేశింపబడింది.

సామాన్య జనులకు అందుబాటులో లేకుండా పోయిన సంస్కృత భాషాధ్యయనాన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చిన ఘనత శ్రీ గురుదేవులకే చెందుతుంది.

గీత, ఉపనిషత్తులు, వేదాలు–వీటిని అభ్యసించే అర్హత స్త్రీలకూ, ద్విజేతరులకూ లేదన్న మూఢవిశ్వాసం, ఈ దేశంలో తరతరాల నుండీ గట్టిగా పాతుకొని పోయింది. ఋషులు సర్వసమదర్శనులు. , 'పండితాః సమదర్శినః' అని గీతా ప్రబోధం. ఇట్టి ఆర్ష భూమిలో ఇలాంటి సంకుచిత భావాలు ఎలా వ్యాప్తి చెందాయో ఊహకందడం లేదు. అందరూ భగవంతుని బిడ్డలే ! అహం బీజప్రదః పితా' అని కృష్ణుని మాట. అంటే 'అందరి ఉత్పత్తికీ కారణమైన తండ్రిని నేనే ' అని ఆ దేవుడు చెప్పాడు. వేదం భగవంతుని వచనమే. మరి భగవంతుని బిడ్డలకు భగవంతుని వచనాన్ని చదివే అర్హత లేదని చెప్పిన మూఢులను గురించి ఏమని చెప్పగలం ?

కేరళలో అవతరించిన శ్రీ నారాయణ గురువు ఈ అంధ విశ్వాసాన్ని గట్టిగా ఎదుర్కొన్నారు. స్వయంగా వేదపాఠశాలలు స్థాపించి అందరికీ అందులో ప్రవేశం కల్గించి వేదాధ్యయనార్హత అందరికీ ఉన్నదని ప్రయోగాత్మకంగా వారు నిరూపించారు. శ్రీ మలయాళ యతీంద్రులు గూడా వారి అడుగుజాడలలోనే పయనించి సమాజాన్ని చక్కదిద్దారు.

మన దేశంలో అత్యంత ప్రాచీన కాలం నుండీ కులానికిచ్చిన విలువ గుణానికి ఇవ్వకపోవడం శోచనీయం. ఈ దుర్వ్యవస్థ సమాజంలో నిమ్నోన్నత భావాలకు ఆస్కారం కల్గించింది. అందరికీ ఆత్మోన్నతి పొందడానికి అవకాశం లేకుండా చేసింది.

ఈ దుర్లక్షణాన్ని అరికట్టడానికే శ్రీవారు "ఇతరుల ఆత్మోన్నతి కడ్డుపడకుడు. మీ ఆత్మోన్నతి కడ్డు కలిగిన తొలగించుకొనుడు. సాధ్యమైనచో ఇతరుల ఆత్మోన్నతికి సాయపడుడు – ఇదే సనాతన ధర్మం" అని సనాతన ధర్మాన్ని సరిక్రొత్త పద్ధతిలో నిర్వచించారు.

పాఠశాలా నిర్మాణము, ఆశ్రమాల స్థాపనమూ, పుస్తక రచన, ముద్రణలు, సనాతనవేదాంతసభా నిర్వహణ, వివిధ ప్రాంతాలలో పర్యటించి తత్త్వ ప్రబోధాలు కావించడం, స్త్రీ, పురుష భేదాలూ, కులభేదాలూ పాటించకుండా అందరికీ వారి వారి జిజ్ఞాసను బట్టి ఆయా రంగాలలో ఆత్మోన్నతి పొందడానికి అవకాశాలు కల్పించడం – ఇత్యాదిగా శ్రీ సద్గురు దేవులు చేపట్టిన లోకోద్ధారక కార్యక్రమాలు ఆంధ్రావనిలో ఒక అపూర్వమైన ఆధ్యాత్మిక చైతన్యం కల్గించాయి. వారి కార్యక్రమాలు పైకి ఆధ్యాత్మకంగానే కనిపించినా, వాటి లోపల సామాజిక స్పృహ, సమాజ సంస్కరణా సుస్పష్టంగా కనిపించేవి.

శ్రీ సద్గురు దేవుల గ్రంథాలు మొత్తం 57 లెక్కకు వచ్చాయి. ఇవికాక శ్రీవారి ప్రబోధాలను విని గ్రంథస్థం కావించుకొన్న భక్తులు తయారు చేసిన గ్రంథాలు గూడా కొన్ని ఉన్నాయి. ఈ గ్రంథాలలో వర్తమాన కాలానికి అనుగుణమైన పద్ధతిలో ధర్మ స్వరూపాన్ని వివరిస్తూ రచించిన ' శ్రీమలయాళ యతీంద్ర గీత అన్న గ్రంథం అత్యంత విశిష్టమైనది. ఇందులో 18 అధ్యాయాలూ గీతలో లాగా 18 యోగాలుగా నిబద్ధమయ్యాయి. భక్తులడిగిన వివిధ ప్రశ్నలకు సముచిత సమాధానాలు ఇందులో లభిస్తాయి. ఇందలి మొత్తం శ్లోకాలు 1120.

ఇందులో ' స్త్రీ విద్యాధికార యోగము, జాతి నిర్ణయ యోగము, యుగనిర్ణయ యోగము, అన్న మూడు యోగాలు (5,6,15 – అధ్యాయాలు) చాలా ప్రధానమైనవి. ఈ యోగాలలో తరతరాలుగా హిందూ సమాజంలో గట్టిపడిపోయి వుండిన మూఢ విశ్వాసాలను శ్రీ సద్గురు

స్వాములవారు నిశితంగా ఖండించారు. అభ్యుదయపథంలో పయనించా లనుకునే వారికి ఆ యోగాలు కరదీపికల వంటివి.

స్త్రీ విద్యాధికార యోగంలో 60 శ్లోకాలు ఉన్నాయి. స్త్రీలకు బ్రహ్మ విద్యార్హత ఉన్నదా ? లేదా ? అనే ప్రశ్నకు విపులమైన, యుక్తి యుక్తమైన, శాస్త్ర ప్రమాణంతో గూడిన ఉపపత్తులతో స్త్రీలకు అట్టి యోగ్యత నిస్సందేహంగా కలదని శ్రీవారు నిరూపించారు.

వ్యాధిగ్రస్తులకు వ్యాధి తొలగించుకోవడానికి ఔషధాన్ని సేవించడంలో అధికారం లేదని చెప్పడం ఎంత అసంబద్ధమో, అజ్ఞాన నివారణకు ఆధ్యాత్మిక విద్యను అభ్యసించడం తగదని చెప్పడం కూడా అంతే అసంబద్ధమని చెప్పారు.

వ్యాధిగ్రస్తా యథావిప్రాశ్శూద్రా నార్యాదయోపివా ।
అర్హాన్యౌషధమత్యన్తం తద్వద్బ్రహ్మాధికారితామ్ ॥

వ్యాధిగ్రస్తులైన విపులు, శూద్రులు, స్త్రీలు మున్నగువారికి ఔషధ సేవనంలో అర్హత ఉన్నట్లే బ్రహ్మాధికారంలో గూడా ఉన్నది అని భావం ఇంకా ప్రాచీనకాలం బ్రహ్మవిద్యలో రాణించిన అనేక నారీమణులను ఉదాహరణంగా చూపి స్త్రీలకు బ్రహ్మవిద్యాధికారం కలదని స్పష్టంగా గురుదేవులు నిరూపించారు.

ఇక జాతి నిర్ణయ యోగంలోని 91 శ్లోకాలలో వర్ణ – జాతి నిర్ణయానికి చెందిన అనేక ప్రశ్నలకు సముచితమైన సమాధానాలు చెప్పారు. దేశ పతనానికి యోగ్యులను గౌరవించకపోవడమే కారణమని నిరూపించారు.

యోగ్యతాంహి సమాలక్ష్య యోగ్యాయ స్థానమున్నతమ్,
యస్మిన్ దేశే న దీయేత స దేశో నంక్ష్యతి ధ్రువమ్ ॥

యోగ్యతను గుర్తించి యోగ్యుడైన వ్యక్తికి ఏ దేశంలో యోగ్యమైన స్థానం కల్పించబడదో, ఆ దేశం తప్పక వినాశానికి గురి అవుతుందని భావం.

విద్యా తపస్సులచే జనులు పూతాత్ములవుతారని వేదం చెబుతున్నది. ఇక విద్యా తపస్సుల కవకాశం లేకుండా కొందరిని నిరోధించడం ఎంత అనుచితమో చూడండి. అది వేదవిరుద్ధమైన చర్య అవుతుంది.

అంతేకాక హిందూ మతములో అందరికీ సమానావకాశాలు లేకపోవడం వల్లనే ఈ మతంలో అనేకులు మతాంతర ప్రవేశం చేశారని గూడా శ్రీవారు వివరించారు.

ఏవం నిషిద్ధా స్వమతే సుఖమప్రాప్యతే జనాః ।
మతాంతరం సమాలంబ్య సంజాతా యవనాదయః (6–29)॥

దీని భావం పైన వివరించినదే

అధః కర్తుం పరాన్యస్తు సమీహేత దురాగ్రహాత్ ।
అధః క్రియేత సోఽప్యన్యై రిదమీశ్వర శాసనమ్ ॥ (6–33)

దురాగ్రహంతో ఇతరుల నణగద్రొక్కడానికి ప్రయత్నించేవాడు తప్పక ఇతరులచే అణచివేతకు గురి అవుతాడు, ఇది ఈశ్వర శాసనమని తాత్పర్యం.

ఇక యుగనిర్ణయ యోగంలో మన వారికి కాలానికి చెందిన యుగాలను విశ్వసించడంలో కల మూఢ విశ్వాసాన్ని గూడా శ్రీవారు ఖండించారు. యుక్తి యుక్తంగా ఆలోచించాలి గాని గ్రుడ్డి నమ్మకం తగదని చెప్పారు.

కాలానికి కారణం రాజా ? రాజుకు కారణం కాలమా ? అన్న ప్రశ్నకు భారతంలో కాలానికి కారణం రాజే అని సముచిత సమాధానం చెప్పబడింది.

కాలస్య కారణం రాజేత్యవదన్నిశ్చితం వచః । (15–12)

ఇక్కడ 'రాజు' అంటే పరిపాలనవిధానం, అని నేటి కాలానికి తగినట్లు అర్థం చేసుకోవాలి.

మన ప్రవర్తనను బట్టి కాలం ఉంటుంది. మనం మంచిగా వుంటే అది కృతయుగమే. మన ప్రవృత్తి చెడుదైతే మనం ఏ కాలంలోని వారమైనా కలియుగానికే చెందుతాము. "కలి కలి" అని జపించి పతనం చెందరాదు అని ప్రబోధించారు.

ఇట్టి విప్లవాత్మకమైన ప్రబోధాలతో, చర్యలతో సమాజాన్ని సంస్కరించడంలో శ్రీ సద్గురు స్వాములవారు చూపిన చొరవ ఆశ్చర్యకరం.

ప్రాచీన సారస్వతంలో ఎన్నో 'గీతలు' ఉన్నాయి. ఆధునిక కాలంలో గూడ శ్రీరమణ గీత, 'శ్రీ సత్యసాయిగీత ' మున్నగు గీతాగ్రంథాలు వెలువడ్డాయి. శ్రీ మలయాళ యతీంద్రుల దివ్య ప్రబోధాలతో మొదటిసారిగా 1954లో వెలువడిన ఈ గ్రంథం 2001లో మరల పరిష్కృతమై 'శ్రీ మలయాళ సద్గురు గ్రంథావళి ' – 20 సంపుటాలలో 20వ సంపుటంగా వెలువడింది. జిజ్ఞాస గలవారందరూ పఠించవలసిన అత్యద్భుతమైన గ్రంథమిది.

3వ జ్ఞాన సదస్సు

శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో 3వ జ్ఞాన సదస్సు ఆగష్టు 3వ తేది నుండి 7వ తేది శ్రావణ పౌర్ణమి వరకు 5 రోజులు జరుగును. ఇంతవరకు జరిగిన సదస్సులో పాల్గొనిన జిజ్ఞాసువులు చాలా ఆనందించారు. ఈ 3వ సదస్సులో పాల్గొనదలించిన వారు వెంటనే శ్రీ శుకబ్రహాశ్రమానికి మీ లేఖ పంపి రిజర్వు చేసుకోండి. భోజనం ఉచితం, నివాస వసతి ఉచితం. **" శ్రీ శుకబ్రహ్మాశ్రమం, శ్రీ శుకబ్రహ్మాశ్రమం (పోస్టు), శ్రీకాళహస్తి – 517640**

పరమ గురువులు

శ్రీ మలయాళ సద్గురు స్వాములవారు

– బ్రహ్మచారి శ్రీ విజయానంద

1885లో అవతరించిన పూజ్య శ్రీశ్రీశ్రీ సద్గురు శ్రీ మలయాళ స్వాములవారు పూజ్య శ్రీశ్రీశ్రీ సద్గురు శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి గురుదేవులు.

శ్రీ మలయాళస్వాములవారి కరుణా స్వభావము చిన్ననాడే లోకమునకు వెల్లడి అయినది. పావురాలను బంధించిన వేటగానికి తగు మూల్యమిచ్చి ఆ మూగజీవులను గాలిలోనికి స్వేచ్ఛగా వదిలారు – కనుకనే " స్వాతంత్ర్య మతము జయించును గాక ! " అని భావికాలములో నినదించినారు.

విద్యాభ్యాస సమయములో రోజుకు 15 ఉత్తమ శ్లోకములను కంఠస్థము చేయనిదే విశ్రమించేవారు కాదు.

ధ్యాన సమయములో తల్లి ఏర్పాటు చేసిన భోజన ప్రసాదముపై కూడా ఏ మాత్రము దృష్టిని పోనివ్వక గంటల తరబడి ధ్యాననిష్ఠలో లీనమయ్యేవారు.

సౌకర్యవంతమైన పడకలను వదలిపెట్టి చాపపైననో, కటిక నేలపైననో విశ్రమించే వైరాగ్యమూర్తులు వారు.

భావికాలములో అఖండ ధ్యానము, తపస్సు చేయుటకుగాను తగిన ప్రదేశము కొరకు భారతదేశమంతటా రోజుకు 20 మైళ్ళు చొప్పున కాలినడకన భక్తిశ్రద్ధలతో తీర్థయాత్రలు చేసిన మహాభక్తులు వారు.

తిరుమలలోని శ్రీ గోగర్భతీర్థము నందు 13 ఏళ్ళు తపస్సు గావించిన మహాతపస్సంపన్నులు వారు.

సాధనకాలములో, తపోకాలములో ఒక్కొక్కసారి ఆకలివేళకు ఆహార ప్రసాదము లభింపకున్నను, క్రూరమృగములు తారసపడినను గురుభక్తిని, దైవభక్తిని ఏ మాత్రము సడలనివ్వని నిర్మలభక్తులు వారు.

అచంచల వైరాగ్యము, అఖండ జ్ఞానబోధ, నిశ్చల సమాధినిష్ఠ,

సర్వజీవులందు సమబుద్ధి తనకు ఎపుడెపుడు సంప్రాప్తమగునా అని భగవంతుని ఏకాగ్రముగా ప్రార్థించిన నిష్కామ భక్తులు వారు.

సంవత్సరములు గడచినా ఇంకను పరిపూర్ణ సిద్ధి కలుగలేదే – అని పరితపించుచు ఒకానొక సమయములో దేహత్యాగమునకు సిద్ధపడినప్పటికి, వెంటనే ఆత్మప్రబోధము పొంది తపోసాధన కొనసాగించి కృతకృత్యులైన ధీరపురుషులు వారు.

వాచావేదాంతుల శుష్క సిద్ధాంతములను ఖండించిన విజ్ఞానకేసరి వారు.

దైవలీల ప్రకారము 'ఏర్పేడు' సమీపమున "శ్రీవ్యాసాశ్రమమును" స్థాపించిన మహనీయులు వారు.

వేదాంత విద్యను అభిలషించు విద్యార్థులకు ఆత్మసాక్షాత్కారమునకు కావలసిన ఉపదేశములను గావించిన సద్గురూత్తములు వారు.

ఎవరినైనా మందలించవలసి వస్తే " ఓయీ! అన్నం తినేవాడా!" అని సంబోధించటమే కాని, కఠిన వాక్కును పలికేవారు కాదు వారు. ఎవరైనా విద్యార్థి పొరపాటున పరీక్షలో తప్పితే "పునాది గట్టిపడుతుందిలే, బాగుగా చదువు " అని చమత్కరించి ప్రోత్సహించేవారు.

భగవద్గీత, కఠోపనిషత్తు, పతంజలి యోగసూత్రములు – 'ఈ గ్రంథములను అధ్యయనము చేస్తే ఎంతయో శాస్త్రజ్ఞానము, ఆత్మ ప్రబోధము కలుగుతుందని ఉపదేశించిన మహాత్ములు వారు.

శ్రీవారి ముఖ్య ఉపదేశములు :

1). తనను తాను ఉద్ధరించుకొనవలెను.

2). ఇతరుల ఉన్నతికి అడ్డుపడరాదు.

3). తన ఉన్నతికి అడ్డు కలిగినచో నిర్మూలించుకొనవలెను.

సాక్షాత్ మోక్షస్వరూపులై పరబ్రహ్మానందస్వరూపులై యుండి కూడా లోకములో అసమానతలను నిర్మూలించుటకు, విశ్వశాంతిని పరిఢవిల్ల జేయుటకు మరల అవతరింపగలనని సర్వభక్తావళికి, అభయమొసంగిన మహితాత్ములు వారు. శ్రీ మలయాళ సద్గురు వర్యుల సంస్మరణము, ధ్యానము, ఆరాధన శిష్య, ప్రశిష్యులకు, భక్తకోటికి పరమానందదాయకము, అనంత శాంతిదాయకము.

ఓమ్

జ్ఞాన సుధ

మూలం
శ్రీ సర్పభూషణ శివయోగి వారు

అనువాదం :
పూజ్యశ్రీ శంకరానందగిరి స్వాములవారు
ఉమామహేశ్వర పీఠాధిపతులు

(2016 నవంబరు సంచిక తరువాయి)

అవతారిక : జ్ఞాన కర్మ సమసముచ్చయము ముక్తికి యోగ్యము కాదని తెలుపుచున్నారు.

వేదపుంసా ద్వితీయా ద్భయం దుందుభౌ
వాదితే సవ్యకర్ణాంతికే సంతతమ్,
జ్ఞానకర్మద్వయం తథ్య మిత్యజ్ఞవాక్
మే న వామశ్రుతే రంతరం గాహతే. 43

సవ్య కర్ణాంతికే = కుడి చెవిదగ్గఱ, సంతతం= ఎడతెఱపి లేకుండ, ద్వితీయాత్ = రెండవదాని (భేదదృష్టి) నుండి, భయం=భయము (గలదు),ఇతి= అని, వేదపుంసా = వేదపురుషుని చేత, దుందుభౌ= భేరి, వేదాంత భేరి, వాదితే సతి= వాయింపబడుచుండగా, జ్ఞానకర్మ ద్వయం = జ్ఞానకర్మ సమసముచ్చయము, తథ్యం ఇతి = నిజము అనెడి, అజ్ఞవాక్ = అజ్ఞుని పలుకు, మే =నా యొక్క, వామశ్రుతేః అంతరం = ఎడమ చెవిలోపల (సైతము) ,న గాహతే = దూఱుట లేదు.

కర్మ భేద దృష్టినే పెంపొందించును. ' అభేద దర్శనం జ్ఞానం" అన్నట్లు జ్ఞానము అభేదానుభవమును కలుగజేయును. కావున వేదమను పురుషుడు నా దక్షిణ కర్ణమందు సదా ఇట్లు భేరి మ్రోగించుచున్నట్లు చెప్పుచుండును. " ద్వితీయాద్వై భయం భవతి" నీవు భేదమును అంగీకరించిన నిశ్చయముగా జననాదిభవ దుఃఖము నిన్ను విడువదు. అందుచేత భేదబుద్ధిని వదలి పెట్టుము. నీవు సుఖ మొందుదువు" అని. అందుచేత జ్ఞానకర్మ (సమ) సముచ్చయముచే ముక్తి యగునని చెప్పు ఆ యజ్ఞుల పలుకులు నా యెడమ చెవినిగూడ ప్రవేశింపజాలవు. అనగా

భయదాయకంబగు భేద రూపకర్మను వీడి సుఖదాయకంబగు అభేద బోధక జ్ఞానమును గ్రహింపుడని చెప్పు వేదవాక్యములను వినునటు వంటి మేము అజ్ఞులగు జ్ఞానకర్మ సమసముచ్చయవాదుల మాటలను వినము అని భావము. జ్ఞానకర్మముల సమసముచ్చయము శీతోష్ణములవలె తేజస్తిమిరములవలె పరస్పరము విరుద్ధమైనందున గ్రహణ యోగ్యము కాదని భావము.

అవ : సిద్ధాంత సమ్మతమైన జ్ఞానకర్మ క్రమ సముచ్చయము అంగీకార యోగ్యమని చెప్పుచున్నారు.

వేత్తి చితి క్రమసాధన రూపాన్
కర్మ సుభక్తి విరాగ యమాన్ యః,
కోరక కుట్మల పుష్ప శలాటూన్
వాతి ఫలే స సముచ్చయవాదీ. 44

ఫలే = ఫలము విషయమున, కోరక = మొగ్గ, కుట్మల= ముదురు మొగ్గ,, పుష్ప = పూవు, శలాటూన్ = కాయ అనెడి వానిని క్రమ పరిణామ సాధన రూపములనుగా, వాతి = తెలిసికొనునట్లు, కర్మ = నిష్కామకర్మ, సుభక్తి = ఉత్తమమైన భక్తి, నవధాభక్తి, విరాగ = ఇహ పర విషయములందు వైరాగ్యము, యమాన్= యమము (యమాద్యష్టాంగ యోగము) అనువానిని చితి = జ్ఞానమునందు, క్రమసాధనరూపాన్ = పరంపరా (క్రమేణా) సాధన రూపములనుగా, యః= ఎవ్వడు, వేత్తి= తెలిసికొనునో, సః=వాడు సముచ్చయవాదీ = క్రమసముచ్చయవాది (యనబడును).

క్రమసముచ్చయ మనగా మొదట లేతమొగ్గ, తరువాత ముదురుమొగ్గ, పిమ్మట పూవు, ఆ పిమ్మట కాయ – ఇవి ఫలమునకు క్రమేణ సాధనములైనట్లు మొదట సకామ కర్మ,, తరువాత నిష్కామకర్మ, ఆ తరువాత భక్తి యివి క్రమేణ అజ్ఞాన – ఆవరణ భంగకారకమగు జ్ఞానమునకు సాధనములగుచున్నవి. ఇట్లు వీనిని జ్ఞానమునకు క్రమముగా సాధనములని అంగీకరించుటకు క్రమసముచ్చయమని పేరు.



చిన్మయ ఉత్తరం

– శ్రీ చిన్మయానంద స్వాములవారు

(వేదాంత త్రూ లెటర్స్ మొదటి భాగములోని గురుదేవుల ఒక ఉత్తరానికి, శ్రీ బొల్లినేని కోటేశ్వరరావుగారి తెలుగు అనువాదము)

ప్రధాన ప్రశ్న :

ధ్యాన సమయంలో మనస్సులో ఏ రూపమూ కూడ స్థిరంగా నిలవడం లేదు?

– శ్రీ భాస్కర్ మీనన్, త్రిచూర్, కేరళ

ఇది మనందరికి సహజమే. ఒక రూపం మీద శ్రద్ధ ఉన్నట్లైతే మనస్సు ఆ రూపాన్ని తీసుకుంటుంది. కానీ, అదే సమయంలో మనస్సు కోతి స్వభావాన్ని కలిగి ఉంటుంది. ఒక క్షణకాలంలో అది తను తీసుకున్న రూపాన్నుండి దూరమై మరో ఆలోచనవైపు పరుగెడుతుంది. ప్రతి ఆలోచనకు మనస్సు ఆ ఆలోచనకు తగినట్లుగా తన రూపాన్ని మార్చుకోవాల్సి వస్తుంది. కనుక నీవు మనస్సులో ఉండవలసిన రూపాన్ని పొందనట్లైతే దానికి కారణం మనస్సు ఒకే విషయం మీద లఘ్నం కాకపోవడం, తగినంత ప్రశాంతత కలిగి ఉండకపోవడం. అన్ని తపస్సుల లోనికి ఏకాగ్రతయే అత్యుత్తమమైనది.

భిన్న ఆచరణల సమూహమే ఆధ్యాత్మిక సాధన, ప్రేమతో నిండిన మహర్షులు దానిని మనకొరకై కనుగొన్నారు. దాని గురించి 'ఏ విధంగా', 'ఎందుకు' అనే విషయాలనన్నింటిని పూర్తిగా తెలుసుకున్నపుడు, చివరకు మనం ఏకాగ్రతను పొందుతాము. ప్రేమ ఉన్నచోట, ఆ ప్రేమికుడు తను ప్రేమించే వానినిగూర్చి ఆలోచించకుండా అస్సలు ఉండలేడు. ఒక వస్తువుపై లేదా ఉద్దేశ్యముపై ప్రేమ ఎంత ఎక్కువగా ఉంటే, అది అంత ఎక్కువగా మన మానసిక దృష్టిలో ఉంటుంది. మనం ప్రేమించే వారిని గూర్చి నిరంతరం ఆలోచిస్తాము. గనుక, మనము అలా ఆలోచించే కొద్దీ మన మనస్సు 'మనం ఆలోచించేదానికి' అనుగుణమైన రూపంలోనికి మారవలసి వస్తుంది.

'ఆలోచన'కు 'రూపాని'కి మధ్యనున్న స్పష్టమైన సంబంధాన్ని అది క్లిష్టమైనదైనా, చాలా జాగ్రత్తగా చదివి, బాగా అర్థం చేసుకొనడానికి ప్రయత్నించు. ఆలోచన 'రూపాన్ని' ఎలా శాసిస్తుందో, ప్రేమ 'ఆలోచనను' ఎలా ఆజ్ఞాపిస్తుందో గమనించు. మనస్సు ఒక 'రూపం'పై ఎలా స్థిరపడుతుందో తెలుసుకో. అప్పుడు తీవ్రముగా సాధనచెయ్. ఎఱుకతో చేసినపుడు ఆచరణ వలన రెండింతల ఫలితాలు వెంటనే వస్తాయి !!

జపము, కీర్తన, భజన, పవిత్ర గ్రంథాలను అధ్యయనం చేయడం.... ఇవన్నీ

కూడా సాధకుడు తన మనస్సును ఒక ఆలోచనమీద, దానికి సంబంధించిన రూపం మీద స్థిరపరచడానికి చేసే బాహ్య ప్రయత్నాలు. ఈ విధంగా జపం చేస్తున్నపుడు ఉచ్చరించే మంత్రం ఇష్టమైన రూపాన్ని తప్పక తీసుకువస్తుంది. జపాన్ని స్థిరంగా అభ్యసించడం ద్వారా, అదే ఆలోచన, తద్ద్వారా అదేరూపము మనసులో మెదులుతుంది. కీర్తన, భజన, స్వాధ్యయనంలో కూడా అలానే జరుగుతుంది.

ఏకాగ్రతతో కూడిన మనస్సును సాధించి, కొనసాగించడానికై మన ఇంటిలో మనం ప్రార్థించుకొనడానికై ఒక మూలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవాలి. ఆ ప్రార్థనా గది దివ్య వాతావరణాన్ని వెదజల్లుతుంది. అక్కడ ఉన్న బొమ్మలు, ప్రతిమలు మనకు ఆ పరమాత్మను గుర్తు చేస్తాయి. దీపకాంతులు, ఆసనము, అలంకరణలు ఆ గదిలో మన చుట్టూ ఉన్న ప్రతి వస్తువు మనకు ఆ పరమాత్మను గుర్తుకు తెస్తాయి. అక్కడి అగరువత్తుల సువాసన ఖచ్చితంగా మన ఆనందం కొరకు మాత్రము కాదు. అవి ఆ పరమాత్మ స్వీకారానికై మనం భక్తితో వెలిగించిన అగరువత్తులని మనకు తెలుసు. ఈ ఏర్పాటు మొత్తం శాస్త్రీయంగా ఎంత ఖచ్చితంగా ఉన్నది ! ఇవన్నీ కూడా మన మనస్సును ఒకే 'ఆలోచన' మీద ఒకే 'రూపం' మీద నిలపడానికే.

మరి అటువంటప్పుడు జపసమయాలలో చిరునవ్వులు చిందిస్తున్న ఆ పరమాత్మ మధుర రూపం నీ మనస్సు నుండి 'నిష్క్రమించినా' వెంటనే కన్నులు తెరువు ! కండ్లు మూసుకునే, పాలుకాయాలని లేదా దోభీ ఇంకా ఇస్త్రీ బట్టలు తీసుకురాలేదని ఆలోచించవద్దు. కనులు తెరచి, దృష్టిని ఆ పరమాత్మ మనోహర రూపంపై నిలుపు. అపుడు కనులు మూసుకుని, లోన ఆ పరమాత్మను 'దర్శించు'.

నీలో ఉన్న గోపికతో ఆ పరమాత్మ మరలా మరలా దాగుడు మూతలు ఆడితే, ఎక్కడ ఉన్నాసరే ఆయనను వేటాడు. కనులు తెరచి, ఆయనను ప్రతిమలో చూడు ! తీవ్రమైన ప్రేమావేశంతో కరిగిపోతూ, ఆయనను మీ హృదయానికి గట్టిగా హత్తుకుని, ఆ 'పరమాత్మ'ను నీలో చూడు ! అప్పుడు ఆయన స్వచ్ఛమైన ప్రేమతో నిండిన అటువంటి నీ హృదయాన్ని వదలి ఎక్కడికి పోగలడు ? ఆయన ఎప్పుడు బయటికిపోడు. కానీ ఇతరుల లౌకిక ఆలోచనలు మనస్సులో ప్రవేశించినపుడు వాటి తాకిడిని ఆ నవనీత బృందావన ప్రభువు తట్టుకొనలేడు. ఆ గోపాల బాలుడు కర్కశంగా బయటికి నెట్టి వేయబడతాడు !!

అంతరాయం లేని ఒక ఆలోచనా ప్రవాహమే ధ్యానం. ఇతర ఆలోచనా ప్రవాహాల తాకిడిని ఆపివేసేటట్లు నీవు నీ మనస్సుకు శిక్షణ ఇచ్చినపుడు మాత్రమే దీనిని నీవు సాధించగలవు. ఒక నెలలో నీవు అద్భుతమైన అభివృద్ధిని, తృప్తికరమైన పురోగతిని కనుగొనగలవు. సరియైన ఆచరణలోనికి దుముకు, తెలుసుకుని అప్పుడు ఆచరించు. శ్రీ కృష్ణ కృపయే భక్తుని నిజమైన సంపద. ఈ శాశ్వతమైన కృపాసంపదను ధ్యానం ద్వారానే సంపాదించగలవు. **(చిన్మయ శారద నుండి)**

ప్రారబ్ధము - పురుష ప్రయత్నము

–ఎ. తారాలక్ష్మి, ఎం.ఎ., ఎం.ఇడి., ఎమ్.ఫిల్. (శ్రీకాళహస్తి)

ఉద్యమేన హి సిధ్యంతి కార్యాణి న మనోరథైః
న హిసుప్తస్య సింహస్య ప్రవిశంతి ముఖే మృగాః.

కేవలము కోరికలున్నంత మాత్రమున సరిపోదు పురుష ప్రయత్నము చేతనే కార్యాలు ఫలిస్తాయి. నిద్రించుచున్న సింహం నోటిలోనికి ఆహారంగా జంతువు ప్రవేశించదు కదా ? అన్నది ఆర్యోక్తి.

కర్మ సిద్ధాంతమును విశ్వసించు వారు మానవుని ప్రవృత్తి లలాట లిఖితమైన అతని పూర్వజన్మ కర్మ ప్రకారమే జరుగుననియు, పురుష ప్రయత్నమునకు ఎంతమాత్రమును అవకాశము లేదని చెప్పుదురు. దీనికి అనుకూలముగ పరీక్షిత్తు మరణ వృత్తాంతము వంటి అనేక చరిత్రలను దృష్టాంతముగ చెప్పుదురు.

విష్ణు పురాణంలో పేర్కొనిన గీతా మాహాత్మ్యంలోని మొదటి రెండు శ్లోకాలలో, ప్రారబ్ధముననుభవించు మనుజునకు భగవంతునిపై అచంచలమైన భక్తి ఎట్లు కలుగునని భూదేవి శ్రీ మహావిష్ణువును ప్రశ్నించగా శ్రీ మహావిష్ణువు " ఓ భూదేవీ ! నిరంతరము గీతనభ్యసించి మనుజుడు ప్రారబ్ధము ననుభవించుచున్ననూ కర్మలచే బాధింపబడడు" అని సమాధానమిచ్చాడు. దీనినిబట్టి పూర్వజన్మ కర్మను పురుష ప్రయత్నము ద్వారా అధిగమించ వచ్చునని భగవానుడే స్వయముగ సూచించాడు.

సాధారణంగా మానవుని మనస్సు అతని పూర్వజన్మ కర్మానుసారము ఆతనిని ధర్మము వైపుకు కానీ లేదా అధర్మము వైపుకు గానీ ప్రేరేపిస్తుంది. మనస్సు అధర్మము వైపు ఈడ్చబడినపుడు మానవుడు ప్రయత్న పూర్వకముగ ప్రబలమైన పురుషప్రయత్నముచే ధర్మమార్గము వైపుకు త్రిప్పవలెను.

పూర్వజన్మ కర్మలు బలవత్తరముగా నుండి కర్మానుసారము ఆతని

చేత అనేక కర్మలు చేయించిననూ సదరు కర్మల మూలకారణమును బాగుగా విమర్శించినచో వాటికి కారణం పూర్వ జన్మలోని ఆతని పురుష ప్రయత్నమే అయి ఉండవలెను. అనగా పూర్వజన్మలోని పురుష ప్రయత్నమే ఈ జన్మలోని ప్రారబ్ధంగా రూపొందుతుంది. ఈ ప్రకారంగా పూర్వ జన్మపు పాపకర్మఫలితాన్ని ఈ జన్మలో తప్పించుకొనవలెనంటే పురుష ప్రయత్నం అంతకన్న ఎక్కువగా ధృడమైన పుణ్యకర్మను చేసి ప్రారబ్ధ కర్మఫలాన్ని తప్పించుకొనవచ్చును. ఈ నేపథ్యంలో ఆ ప్రారబ్ధకర్మ కన్నా ఈ పురుషప్రయత్నం బలమైనది. కానట్లయితే అతని పురుష ప్రయత్నం వ్యర్థమవుతుంది. సతీసావిత్రి, భక్త మార్కండేయవంటి వారు ప్రబలమైన పురుషప్రయత్నముతో ప్రారబ్ధమును తప్పించుకొనగల్గిరి.

శ్రీ మద్భగవద్గీతలో భగవానుడు ఆరవ అధ్యాయంలో పురుష ...ఆత్మనాత్మానాం.... అను శ్లోకములో ప్రతి ...చు కొనవలెనని బోధించి యున్నాడు.

...శ్రీ వివేకానందులవారు కూడా పురుష ప్రయత్నమును ఎంతగానో సమర్థించారు. భగవంతుని ముందు మోకరిల్లి ““నేను అల్పుణ్ణి, నీవే సమస్తము, నిన్ను శరణుజొచ్చితిని”అని వేడుకొనే సగటు మనిషి ధోరణిని వారు ఎన్నటికీ అంగీకరించరు. అటువంటి వారి వలన ప్రపంచమునకు గానీ, దేవునికి గానీ ఎటువంటి ఉపయోగమూ లేదన్నది వారి బలమైన వాదన.కనుక అధ్యాత్మ మార్గములో ప్రవేశించే మనుజుడు తొలుత తనను తాను పుష్టితరం చేసుకోవాలి. పుణ్యకర్మాచరణ, నిష్కామ సాధన తప్పనిసరిగా ఆచరించాలి. సాధన ప్రారంభంలో మలిన సంకల్పములను శుద్ధ సంకల్పములతో నిర్మూలింపవలెను. వేద శాస్త్రములు నిర్దేశించిన విహితకర్మలను పురుషప్రయత్నముతో తప్పక ఆచరించ వలెను. నిషిద్ధ కర్మలను పూర్తిగా నిషేధించవలెను.

కనుక ప్రతి మానవుడు శాస్త్రీయ మార్గంలో పురుష ప్రయత్నం చేసి, ఆ ప్రయత్నం సఫలం కానట్లయితే విచారపడక పట్టుదలతో మరల మరల ప్రయత్నము చేయుచునే ఉండవలెను.

ఎవరి కెఱుక ?

– ఆచార్య కె. సర్వోత్తమరావు (తిరుపతి)

శ్రీ రామానుజుల తిరుమల తిరుపతి దేవస్థానముల నిత్య కైంకర్యములు

– డా ॥ బత్తుల శ్రీరాములు (తిరుపతి)

దక్షిణ భారతదేశంలో జన్మించిన త్రిమతాచార్యులలో రామానుజుల వారు రెండవ వారు. ఆచార్యత్రయంలో రామానుజులు ద్వితీయులైనా ఆయనకు గల సామాజిక దృష్టి, ఆలయ సంప్రదాయ పునరుద్ధరణాదృష్టి అద్వితీయ మనక తప్పదు.

రామానుజుల జీవితాన్ని పరిశీలిస్తే వారు ప్రధానంగా శ్రీరంగం, మేల్‌కోటె, తిరుపతి, తిరుమలలో అనేకానేక ఆలయ కైంకర్యాలు సమర్థవంతంగా చేసినట్లు అవగతమవుతుంది. రామానుజులు తిరుపతికి మూడుసార్లు విచ్చేశారని ప్రసిద్ధి. మొదటిసారి యాదవరాయల కోరిక మేరకు విచ్చేసి తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర స్వామి సాక్షాత్ విష్ణు స్వరూపుడని పౌరాణిక ఆధారాలతో నిరూపించి విపక్షులను నోరు తెరవకుండా చేశారు. ఇక రెండవసారి తిరుపతి విచ్చేసి కొండ ఎక్కకుండా అలిపిరి దగ్గర మేనమామ అయిన తిరుమల నంబి దగ్గర రామాయణ రహస్యాలను ఆకళింపు చేసుకొన్నాడు. మూడవసారి రామానుజులవారు కాశీనుండి వస్తూ అనేక పుణ్య క్షేత్రాలను సందర్శిస్తూ తిరుపతికి చేరుకొన్నారు. ఆ సమయమున భక్తాదుల కోరిక మేరకు కొండ ఎక్కి తిరుమల చేరుకొన్నారు.

రామానుజులవారు తిరుమల చేరుకొన్న సందర్భంలో అక్కడి అవ్యవస్థత ఆచార్యులవారికి అవగతమయింది. వాటినన్నింటినీ రామానుజులవారు సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. రామానుజుల వారు చేపట్టిన నిర్మాణాలు అనేకం. మొదటగా గుడిచుట్టూ ఎగుడు దిగుడుగా ఉండడం గుర్తించి గట్టి ప్రయత్నంతో మాడవీధులను విస్తరింప చేశారు.

వాహనసేవలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయం చుట్టూ తిరగడానికి వీలుగా చేశారు. ఆ నాటికి తిరుమలలో బ్రహ్మోత్సవం అంకురార్పణ జరిగినా ఉత్సవాలన్నీ తిరుచానూరులోనే జరిగేవి. రామానుజులు ఇలా జరగడం బాగాలేదని తిరుమలలోనే ఉత్సవాలు జరిగేవిధంగా చేశారు.

కొండమీద స్వామిని పూజించేవారు వైఖానసులు. వారి మనసులు నొప్పించకుండ చేయాలని తిరుమలలో వైఖానస సంప్రదాయాన్ని అంగీకరించి ఆలయఉత్సవాదుల పర్యవేక్షణ మాత్రం తమకుండేలా చేసుకొన్నారు. కొండ మీద ఈ పర్యవేక్షణ చేయడానికి జియ్యర్ వ్యవస్థను ఏర్పాటు చేశారు.

ఆళ్వారులు శ్రీ వేంకటేశ్వరస్వామిని స్తుతించడం వల్ల రామానుజుల వారు క్రమక్రమంగా ఆలయంలో తమిళ సంప్రదాయాలను ప్రవేశ పెట్టారు. స్వామి అలంకరణకు పూలబుట్టను మోసుకొని రావడం జియ్యర్‌ల కర్తవ్యంగా మారింది. అంతవరకు సంస్కృతంలోనే అర్చనాదులు వుండగా 'శార్తుముర్రై' పేరుతో ద్రవిడ ప్రబంధ పారాయణం మొదలైంది. అలాగే వాహనసేవలో కూడ దివ్యప్రబంధాల గోష్ఠి తిరుగులేని ఒక సంప్రదాయంగా నిలిచిపోయింది. అలాగే డిసెంబర్ , జనవరి నెలల్లో " అధ్యయనోత్సవం" పేరుతో నాలుగు వేల పాశు రాలను అధ్యయనం చేయడం అదీ కోవెలలో జరగడంలో రామానుజుల కృషి అపారమని చెప్పక తప్పదు. అలాగే కళ్యాణోత్సవాలలో ఆండాళ్ రచించిన "వారణ మాయిరన్" అనుసంధానం చేయడం, మార్చడానికి వీలులేని వివాహసంప్రదాయంగా నిలిచిపోయింది.

రామానుజులవారు శ్రీ వేంకటేశ్వరస్వామి వారు సాక్షాత్ విష్ణు వనడానికి గట్టి ప్రయత్నం చేశాడు. స్వామికి ఒక నాగాభరణమే వుండగా మరొక నాగాభరణం గూడ తయారు చేయించి అలంకరింప చేశాడు. స్వామి వక్షస్థలంలో లక్ష్మీ విగ్రహాన్ని స్థాపితం చేసి ప్రతి శుక్రవారం అభిషేకం చేసేలా కొత్త సంప్రదాయం తెచ్చి పెట్టాడు. ఆలయం బయట పూజాదులకు నోచుకొని యోగ నరసింహుని, ఆలయం లోపలే ప్రతిష్ఠ చేయించాడు. ఒకానొక భక్తుడు రామలక్ష్మణ ఆంజనేయ విగ్రహాలు మాత్రమే ఇస్తే రామానుజుల వారు సీతమ్మ వారి విగ్రహాన్ని గూడ చేయించారు. ప్రతి పునర్వసు నక్షత్రంలో పూజాదులు జరిగే విధంగా కట్టడి చేశాడు.

తిరుమలలోని స్వామికి ఎన్నో సేవలు నిస్వార్థంగా చేసిన వారున్నారు. వారిని స్మరించుకొనేలా ఉత్సవాలు ఏర్పాటు చేశాడు. వాటిలో తిరుమలనంబి "అనంతాళ్వాన్"తోటలో జరిగే ఉత్సవాలు చెప్పుకోదగ్గవి. రామానుజులవారు ఇంతటి సేవ చేయడం వల్ల తిరుమలలో వారికి ఒక ఉపాలయం ఏర్పడడం ఒక విశేషం. అది గూడ హుండీకి ఎదురుగా వుండడం ఆశ్చర్యకరమైన అంశం. స్వామి వారే తనకు కానుకగా భక్తులు వేసే ధన, కనక వస్తువులను రామానుజులు ముందు పోసి "అంతా మీకెరుకే సుమా అన్నట్లు తలపించడం" అని శ్రీ వైష్ణవులు గొప్పగా చెప్పుకొంటారు.

రామానుజులు తిరుమలలో లాగే తిరుపతిలో కూడ ఎన్నో కైంకర్యాలు చేపట్టినారు. వాటిలో గోవిందరాజు స్వామి ఆలయంలో గోదాదేవి ప్రతిష్ఠ ప్రధానమయింది. అలాగే ఆలయం బయట ఆళ్వారుల ఉపాలయాలు ఏర్పడడం వారి దూరదృష్టికి నిదర్శనం. కొండ మీద లాగే తిరుపతిలో కూడ అన్ని ఉత్సవాలు జరిపేటట్లు కట్టడి చేయడం వారి ఆలయ పాలనలోని విశిష్టాంశం.

" గతులన్ని ఖిలమైన కలియుగ మందున
గతి యాతడే చూపె ఘన గురుదైవం "

అన్నది సార్థకమయ్యేలా తిరుమల తిరుపతిలను తీర్చిదిద్దినది రామానుజుల వారే. రామానుజుల సహస్రాబ్ది సంవత్సరంలో వారిని స్మరించడం మనందరి బాధ్యత.

శ్రీ మదాంధ్ర మహా భాగవతము

- ఆచార్య జక్కంపూడి మునిరత్నం (తిరుపతి)

(గత సంచిక తరువాయి)

" అశ్వత్థామ ప్రయోగించిన బాణజ్వాలలు ఉత్తరగర్భంలోని శిశువును చుట్టుముట్టాయి. భరించరాని తాపంతో ఆ బాలుడు ఆక్రోశించాడు.

దైవమా ! ఈ బాణాగ్ని వల్ల నేను మరణిస్తానేమో. కడుపులో ఉన్న నా ఆపదను ఎవరు గుర్తించగలరు ? కడుపులోనే నేను మరణిస్తే ప్రసవించలేక మా అమ్మ కూడా మరణిస్తుందేమో ఆ బ్రాహ్మణుడి బాణాగ్ని నుంచి శ్రీ హరే నన్ను రక్షిస్తాడని మా అమ్మ అందరితోనూ చెబుతూ ఉంటుంది. ఆ చల్లని మాట నిజమౌతుందా ? అందరిలోనూ ఉండే సర్వేశ్వరుడు ఇక్కడ లేడా ? ఆపన్నులను రక్షించే ఆ పరమేశ్వరుడు ఈ బాణాగ్నినుండి నన్ను కాపాడడా ? నా కర్మఫలం ఎలా ఉంటుందో ఏమిటో ? ఈ విధంగా ఉత్తర ఉదరంలో ఉన్న చిన్నారి ఎన్నో విధాలుగా చింతించసాగాడు.

ఆ సమయంలో బొటన వ్రేలంత శరీరంతో విష్ణువు ఆ బాలుడికి కనిపించాడు. నల్లని శరీరం, పచ్చనిబట్ట, మకర కుండలాలు, జేవురించిన కళ్ళు, తలమీద బంగారు కిరీటం, కంకణాలు, భుజకీర్తులు, వనమాల, చేతిలో గద ఈ ఆకారంతో విష్ణువు బాలుడిముందు ఆవిర్భవించాడు. గదను బిడ్డ చుట్టూ తిప్పి అతని తాపాన్ని పోగొట్టాడు. ఇలా తనను రక్షించిన మహానుభావుడెవరా అని ఆ బిడ్డ పరీక్షగా వీక్షించేలోగానే ఆ మహావిష్ణువు అంతర్హితుడయ్యాడు.

ఆ సమయంలో పాండవులను, ద్రౌపదిని వెంటబెట్టుకొని

కుంతీదేవి శ్రీ కృష్ణుడున్న ప్రదేశానికి వచ్చింది. అతన్ని శ్లాఘించి వినుతించింది.

కృష్ణా ! నువ్వు పురాణ పురుషుడివి. ప్రకృతికి అటువైపు వాడివి. సమస్తప్రాణుల లోపలా వెలుపలా ప్రకాశించే వాడివి. అనంతుడివి. అటువంటి నీకు నమస్కారం. రాగద్వేషాలు లేని మహర్షులకే గోచరం కాని నిన్ను అజ్ఞానులమూ, సంసారంలో మునిగిన వాళ్ళమూ అయిన మాలాంటి వాళ్ళు ఎలా చూడగలుగుతారు ? దుర్యోధనుడు పెట్టించిన విషాన్నం తిని మరణించకుండా భీముణ్ణి రక్షించావు. తగులబడిన లక్క ఇంట్లో మమ్మల్ని కాపాడావు.ద్రౌపదీమానసంరక్షణం చేశావు. యుద్ధరంగంలో పాండవుల్ని కాపాడావు. ద్రౌణి బాణాగ్నిలో దగ్ధం కాకుండా ఉత్తర గర్భాన్ని రక్షించావు. నిష్కాములైన భక్తులకు మాత్రమే నువ్వు గోచరిస్తావు. వంశము, సంపద, విద్య ఉన్నాయని విర్రవీగేవాళ్ళు నిన్ను గుర్తించి కొనియాడలేరు. నీ అవతారం గురించి అనేకులు అనేక విధాలుగా చెప్పుకుంటారు. మమ్మల్ని విడిచి వెళ్ళడం న్యాయం కాదు. యాదవుల మీద, పాండవుల మీద నాకున్న మమకారం నశింపజెయ్యి, సముద్రుణ్ణి వెతుక్కుంటూ వెళ్ళే గంగానదిలాగా నీ పాద చింతనంలోనే నా మనస్సు లగ్నమయ్యేట్టు చెయ్యి".

కుంతి ఈ విధంగా శ్రీకృష్ణుణ్ణి స్తోత్రం చేసింది. మాధవుడు తన మధుర మందహాసంతో ఆమెను మైమరపించాడు. కుంతి కోరికమీద పాండవుల రథమెక్కి హస్తినకు తిరిగి వచ్చాడు. కొన్నాళ్ళ తర్వాత శ్రీకృష్ణుడు కుంతికి, సుభద్రకు చెప్పి ద్వారకకు బయలుదేరాడు. మరికొన్నాళ్ళు ఉండి వెళ్ళమని ధర్మరాజు వేడుకోవడంతో తన ప్రయాణాన్ని అప్పటికి వాయిదా వేసుకున్నాడు.

అశ్వత్థామ ప్రయోగించిన బాణాగ్ని నుండి పాండవులను, పరీక్షిత్తును రక్షించడం శ్రీకృష్ణుడికి భక్తులపట్ల, ధర్మంపట్ల, దాన్ని అనుసరించే వారి

పట్ల గల ప్రీతిని తెలియజేస్తుంది. విష్ణువుకు ఏదీ అసాధ్యం కాదని విదితమౌతుంది. ఐహిక వ్యామోహాన్ని అంతరింపజేసుకొని భగవత్ పాదార విందసంలగ్న మనస్కులు కావలసిన ఆవశ్యకతను కుంతీ ప్రార్థన బోధపరుస్తుంది.

శ్రీ కృష్ణ ద్వారకాగమనం : శ్రీకృష్ణుడు ద్వారకా నగరానికి బయలుదేరాడు. రథాన్ని అధిరోహించాడు. అర్జునుడు కృష్ణుడి వెనుక వైపు నిలబడి తెల్లగొడుగు పట్టాడు. ఉద్ధవుడూ, సాత్యకీ చెరోవైపు నిలబడి వింజామరలు విసిరారు. బాకాలూ, నగారాలూ, తప్పెటలూ, శంఖాలూ మ్రోగాయి. బ్రాహ్మణులు స్వస్తి వచనాలు పలికారు. ఇంతలో సుభద్రా ద్రౌపదులు,కుంతీ గాంధారులు, ధృతరాష్ట్రుడు, విదురుడు, ధర్మరాజు, యుయుత్సుడు, కృపాచార్యుడు, నకులసహదేవులు, భీమసేనుడు, ధౌమ్యుడు మొదలైన వారంతా అక్కడికి చేరుకున్నారు. కృష్ణుడి రథం సాగుతూ ఉంటే అక్కడ గుమికూడిన వాళ్ళంతా అతని ఎడబాటును సహించలేక అలాగే చూస్తూ కొద్దిసేపు నిలబడ్డారు. కృష్ణుడి రథం హస్తినాపుర వీధుల్లో వెళ్ళుతునప్పుడు ఆ నగరంలోని స్త్రీలు మేడల పైకెక్కి కృష్ణుడి మీద పూలు చల్లారు. తన ఎడబాటును ఓర్చుకోలేక సాగనంపడానికి వచ్చిన పాండవులను సానునయ వాక్యాలతో కృష్ణుడు వెనక్కి పంపాడు.

శ్రీ కృష్ణుడు యమునానదిని దాటాడు. కురుజాంగల పాంచాల శూరసేన దేశాలు దాటాడు. బ్రహ్మావర్త కురుక్షేత్రాలను అధిగమించాడు. మత్స్య, సారస్వత, మరుధన్వ, ఆభీర , సౌవీర, సింధు దేశాల మీదుగా ప్రయాణం సాగించాడు.

శ్రీకృష్ణుడు ద్వారకానగర సమీపానికి వెళ్ళి తన పాంచజన్య శంఖాన్ని పూరించాడు. ద్వారకానగర ప్రజలంతా సంతోషించారు.

సంభారాలతో ఎదురువచ్చారు. వాసుదేవుణ్ణి అనేక విధాలుగా కొనియాడారు. కృష్ణుడు లేనిక్షణం తమకు ఒక యుగమే అన్నారు. తల్లి, తండ్రి, స్నేహితుడు, గురువు, దైవము అన్నీ తమకు మాధవుడేనన్నారు. ఆ స్వామి వియోగాన్ని సహించలేమన్నారు. ఇకమీద ఎక్కడికీ వెళ్ళక ద్వారకలోనే నివసించమని ప్రాధేయపడ్డారు. శ్రీకృష్ణుడు పౌరులందరూ తెచ్చిన కానుకలను సంతోషంగా స్వీకరించాడు. వారిమీద తనకటాక్ష వీక్షణాలను ప్రసరింపజేశాడు. ఇంతలో కృష్ణుడు వచ్చిన వార్త విని తమ పనులను పక్కన పెట్టి ఉగ్రసేనుడూ, అక్రూరుడూ, వసుదేవుడూ, బలభద్రుడూ మొదలైన పెద్దలు ఎదురు వచ్చారు. ప్రద్యుమ్నుడూ, సాంబుడూ, చారుదేష్ణుడూ, గదుడూ మొదలైన యదుకుమారులూ వచ్చారు. అందరితో కలసి శ్రీకృష్ణుడు – కుబేరుడి అలకా పట్టణాన్ని, దేవేంద్రుడి అమరావతి పట్టణాన్ని తలదన్నే, ద్వారకా పట్టణంలో ప్రవేశించాడు.

కృష్ణుడు రాజవీథి గుండా వెళ్ళుతున్నప్పుడు పురస్త్రీలు మేడలెక్కి పరవశించి చూశారు. ఆయనమీద పూలుచల్లి తమ ఆనందాన్ని ప్రకటించు కున్నారు. దేవదేవుడు ఆవిధంగా వెళ్ళి దేవకీ వసుదేవుల మందిరంలో ప్రవేశించాడు. ఏడుగురు తల్లులకు నమస్కరించాడు. వారు కృష్ణుణ్ణి ఆప్యాయంగా అక్కున జేర్చుకున్నారు.

శ్రీకృష్ణుడు తన అంతఃపుర ప్రాంగణంలో ప్రవేశించాడు. ఆ ప్రాంగణంలో పదహారు వేల నూట ఎనిమిది బంగారు మేడలున్నాయి. అవన్నీ శ్రీకృష్ణుడి భార్యల మేడలే. మొదట ఎవ్వరి మేడలో ప్రవేశించినా తక్కిన అందరికీ అసూయ కలిగే అవకాశముంది. తనను కోపగించుకొనే ప్రమాదముంది. అందువల్ల ఆ మాయామానుష విగ్రహుడు పదహారు

వేల నూటఎనిమిది శ్రీకృష్ణరూపాలు ధరించి ఒకేసారి ఆ మేడలన్నింటిలోనూ, ప్రవేశించాడు. ఇల్లాండ్లందరూ ఎదురు వచ్చి ఆయనకు స్వాగతం పలికారు. కృష్ణుడు ముమ్ముందుగా తన ఇంటికే వచ్చాడనీ, అందరికంటే అధిక సౌభాగ్యవతి తానేననీ ప్రతి ఇల్లాలూ సంబరపడింది, అతనిని అర్చించి ఆనందించింది. కృష్ణుడు వారందరినీ కుశలమడిగి తెలుసుకున్నాడు. శ్రీకృష్ణుడు ద్వారకలో లేనప్పుడు ఆయన భార్యలు అలంకారాలన్నిటిని విడిచిపెట్టి విరాగినులై గడిపారు. అటువంటి వీరు ఇప్పుడు ఆ మాధవుడితో సరికొత్త భావాలతో శృంగార క్రీడలు సాగించారు. తమ అందంతో మన్మథుణ్ణి జయించిన పరమేశ్వరుడినైనా మోహింపజేయగల ఆమోహనాంగులు తమ హావభావ విలాసాలతో హరిని సమ్మోహింపజేయలేక పోయారు. పరమేశ్వరుడు ప్రకృతితో కలిసి ఉన్నప్పటికీ ఆ ప్రకృతి గుణాలు పొందడు.

శ్రీ కృష్ణుడి వైభవాన్నీ, ఆధిక్యతను తెలుసుకునేందుకు ఈ అంశాలు తోడ్పడతాయి. తాను జగదీశ్వరుడైనప్పటికీ తల్లులకు నమస్కరించి వారి దీవెనలను పొందడం ఉత్తమ సంస్కారానికి ఉదాహరణ ఏర్పరచినట్లైంది. తన ప్రవర్తన వల్ల తనవారెవరూ బాధపడకూడదని, పైగా సంతోషాన్నే పొందాలనీ గోవిందుడు భావించినట్లు భార్యల పట్ల అతడు మలుసుకున్న తీరు అభివ్యక్తం చేస్తుంది.

వేదాన్తభేరికి ఈ క్రిందివారు పోషక చందా పంపినారు

01.	కె.చంద్రశేఖర్‌రెడ్డి (అప్పయ్యపల్లి)	–	రూ.1500/–
02.	కె.ఎల్.నరసింహరావు (సూర్యాపేట)	–	రూ.1200/–
03.	కె.ఆర్. రామారావు (కౌశాంబి)	–	రూ.1500/–
04.	ఎస్.సత్యనారాయణ (శాన్తినగర్)	–	రూ.1200/–

వార్తలు

(01). మే 21తేది ఆదివారం హనుమజ్జయన్తి సందర్భంగా శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో ఆంజనేయస్వామికి షోడశోపచార పూజ జరిగినది. ప్రసాదవితరణ చేయబడినది.

(02). మే 21వ తేది ఆదివారం హనుమజ్జయన్తి సందర్భంగా చిత్తూరుజిల్లా శ్రీ రంగరాజపురం మండలం సింధురాజపురంలో ప్రాచీన హనుమంతునికి శ్రీ విద్యా స్వరూపానందగిరిస్వాములవారు ప్రథమాభిషేకం చేశారు. ఆ తరువాత గ్రామస్థులంతా పాలాభిషేకాలు 108 హోమ కుండాలతో హోమాలు ఆపై హనుమంతునికి అర్చన వగైరా వైభవంగా పరిసర గ్రామస్థులందరు కలసి చేశారు. ఈ కార్యక్రమం శ్రీకృష్ణానందస్వామి వారి పౌరోహిత్యంలో జరిగినది. ఇందు పూజ్యశ్రీ విద్యా స్వరూపానందగిరి స్వాములవారు అనుగ్రహభాషణ చేశారు.

(03). 4-6-2017 తేది ఆదివారం చిత్తూరుజిల్లా ఏర్పేడు మండలం రాజులపాళెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీరామకృష్ణాశ్రమ దేవాలయ ప్రతిష్ఠ,కుంభాభిషేక కార్యక్రమాలలో పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు పాల్గొనినారు.

(04). 9-6-2017 తేది శుక్రవారం హిందూధర్మ పరిరక్షణట్రస్టు ద్వారా శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం వారిపైకంతో చిత్తూరు జిల్లా వెంకటగిరి కోట మండలం మద్దిరాల గ్రామం కాలనీలో నూతనంగా నిర్మింపబడిన అమ్మవారు దేవాలయ ప్రతిష్ఠ, కుంభాభిషేక కార్యక్రమంలో పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు పాల్గొని అనుగ్రహభాషణ చేశారు. ఈ కార్యక్రమం చాలా ఆనందంగా సమరసతాఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో జరిగినది.

(05). జూన్ 28వ తేది బుధవారం స్కంధ పంచమి సందర్భంగా ఆశ్రమ శివాలయంలోని శ్రీ సుబ్రహ్మణ్యస్వామికి పంచామృతాభిషేకం, అర్చన జరిగినది.

(6). (ఎ). జూన్ 9వ తేది పౌర్ణమి సందర్భంగా శ్రీ సద్గురు పాదుకలకు పూజ చేయబడింది.(బి). 22వ తేదిమాసశివరాత్రి సందర్భంగా ప్రదోషకాలంలో ఆశ్రమ శివాలయంలోని నర్మదేశ్వరుడికి రుద్రాభిషేకం బిల్వార్చన చేయబడినది

(07). ఆశ్రమ కంటి ఆసుపత్రిలో మే నెలలో ఓ.పి.లో **1018** మందికి కంటి పరీక్షలు, చికిత్సలు చేయబడినవి. **96** మందికి పొరలు తీసి కళ్లలో లెన్సు అమర్చబడినవి. **6 గురికి** మందికి లేజర్ చికిత్సలు చేయబడినవి.